# సుదర్శనం

**కాలచక్రము** తిరుగుతూనే ఉంది.

కలియుగం కాలుమోపి 2909 సంవత్సరాలైంది. దాన్నే మనం క్రీ.పూ. 193వ సంవత్సరమంటున్నాము.

రంగుల హంగులతో కళింగ రాజప్రసాదము ఇంద్రధనుస్సులు పూయిస్తోంది. కొత్త అలంకారాలు సంతరించుకున్న రాజభవనము పెళ్ళికూతురులా తయారైంది. రాజ్యాన్ని అతలా కుతలం చేసిన ప్రకృతి ప్రళయ తాండవానికి కష్టాల కడలిలో కొట్టుకుపోతున్న ప్రజావళి నాదుకోవడములో తలమునకలైన కళింగ మహారాజు మహామేఘ వాహనుని మదిలో కష్టాలు కలకాలం ఉండవలనే విశ్వాసం మొగ్గతొడిగింది. పెదాలపై చిగురు తొడిగిన చిరునవ్వు గురుకులములో సకల విద్యాపారంగతుడైన కుమారుడు ఖారవేలుడిని యువరాజుగా ప్రకటించింది. గుండెల మీది కొండంత భారం కొద్ది కొద్దిగా తొలగిపోతోంది.

యువరాజుకు దేశకాల పరిస్థితులు కరతలామలకం కావాలనే సంకల్పం - మంత్రులు, సేనానాయకుల మధ్య కూచోపెట్టింది. అప్పటివరకు ప్రకృతి పాఠశాలలో పర్ణశాల నివాసము, కటిక నేల నిద్ర, నిత్య పఠనాని కలవాడు పడిన నూనూగు మీసాల నూతన యౌవ్వనం వినూత్న వాతావరణము చవిచూస్తోంది. పదహారేళ్ళ ఖారవేలునికి పట్టువస్త్రాలు, పసిడి కిరీటము, పూలపాన్పు లాంటి మెత్తని ఆసనము వింత అనుభూతినిస్తున్నాయి. అనుభవస్నాతలైన పెద్దల మాటలను చద్దిమూటలుగా భావించి శ్రద్ధగా వింటున్నాడు.

"కుమారా !" మహారాజు మహామేఘవాహనుని గొంతులో పుత్రప్రేమ తొణికిసలాడ్తోంది. అదంతా బయట పడకుండా జాగ్రత్త పడుతున్నాడు.

"పక్కనున్న మగధ, మన కళింగ రాజ్యాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అలనాడు మదోన్మత్తులైన మగధ నంద రాజులు మన ప్రజలు ప్రాణసమానంగా భావించే శీతల నాథ జైన విగ్రహాన్ని కండబలంతో తరలించుకు పోయిన వైనం ఇప్పటికీ మన మనసుల్ని తొలిచేస్తుంది. మతాలన్నీ మాధవుడిని చేరేందుకు మార్గాలైనా మన రాజ్యముతో జైన మతము పెనవేసుకుంది. మన ప్రజల మనోభావాలను కాపాడేందుకా విగ్రహాన్ని మనం తిరిగి సాధించాలి. ప్రజల మనోభావాలను మన్నించని ప్రభుత్వం ఉన్నా లేకున్నా ఒకటే. పైగా ఇది కళింగ గౌరవ ప్రతిష్ఠలకు సంబంధించిన విషయం కూడా" - చూపులు సుపుత్రుడి నాపాదమస్తకం అభిషేకించి ముఖ కవళికలను తడుముతున్నాయి.

బయట కాపలాదారుల పహారా కొనసాగుతోంది.

ఖారవేలుని యువరక్తములో ఉత్సాహం ఉరకలేసింది. అందరి తలపాగాలు, కిరీటాలను అలవోకగా, చెక్కు చెదరని గోడల రంగుల్ని క్రీగంటితో తడిమాక దృష్టి మహామంత్రి వైపు మళ్ళింది.

"అంతేకాదు యువరాజా !" మహామంత్రి పట్టు పాగా సవరించుకుని సవినయంగా మనవి చేస్తున్నాడు.

"మగధ చక్రవర్తి అశోకుడానాడు అకారణంగా మనతో యుద్ధం చేశాడు. తరాలు మారినా ఆ ఘోరకలి నెవ్వరూ మరిచిపోలేక పోతున్నారు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న లక్షలాది సైనికులా ఘోరకలికి బలయ్యారు. ఎర్రని రక్తం ఏరులైపారింది. మానవత్వం మంట గలిసింది. మన రాజ్యాన్ని మరు భూమిగా మార్చిన అశోకుడు పశ్చాత్తాపంతో తల్లడిల్లి బుద్ధ భగవానుని పాదాల చెంత వాలాడు. మీ తాతగారినే కళింగకు సర్దారుగా నియమించాడు. శాంతి మంత్రముతో ప్రశాంతిని వెదజల్లిన బౌద్ధం సర్దారులను స్వతంత్రులుగా మార్చింది. ఆ తర్వాతనే మీ తండ్రి, ఈ మహామేఘవాహనుల వారీ రాజ్యభారాన్ని స్వీకరించారు."

'అలాగా !' అన్నట్టుగా యువరాజు తల పంకించాడు.

"యువరాజా !" మరొక మంత్రి అందుకున్నాడు.

"అతి వృష్టి మన రాజ్యాన్ని అల్లకల్లోలం చేసింది. చిచ్చర పిడుగులా విరుచుకుపడ్డ తుఫాను వేలాది ప్రాణాలు బలిగొన్నది. లక్షలాది ఇళ్ళు ధ్వంసమై పోయినై. పశు సంపద నశించింది. నిర్వాసితుల పునరావాసం కోసం ఖర్చు తడిసి మోపెడైంది. కోటగోడలు పేకమేడల్లా పడి పోయినై. నదులు, కాల్వలు ఉప్పు నీరు మయమై పోయినై, రైతులకు సాగునీరు, రాజధానికి తాగునీరు కరువైంది. ఈ విపత్కర పరిస్థితులనధిగమించేందుకు మహారాజు అహరహం శ్రమిస్తున్నారు..."

మహారాజు కళ్ళల్లో మానిసికాందోళన కదలాడి మరెన్నో విషయాలు చెప్పింది. వాతావరణం ప్రశాంతంగా ఉంది.

"యువరాజుల వారికి జయమగు గాక !" సైనికాధికారికి తన వంతు కర్తవ్యం గుర్తు కొచ్చింది.

"మన సైనిక బలగాలు అప్రమత్తంగా ఉన్నాయి. అయినా అశోక చక్రవర్తి ఆగడాలను మరువలేక పోతున్నాయి. రక్షణ బలగాల్లో ఆత్మ విశ్వాసం పెంచాల్సిన అవసరమెంతో ఉంది. సామాన్య ప్రజల్ని అసామాన్య సాహసవంతులుగా తీర్చి దిద్దాల్సిన తరుణమిది."

కొన్ని ఝాముల పాటు జరిగిన సమావేశం యువరాజు ఖారవేలుని అవగాహన నెంతో పెంచేసింది. మానసిక పరిస్థితి... విశ్చలమైన నీటిలో గులకరాయి విసిరినట్టయింది.

'ఆకాశ వీధిలో హాయిగా విహరిస్తున్న పక్షి మోయలేని భారాన్ని రెక్కల మీది కెక్కించు కుంటుంది గదూ !' – గుంజాటన ప్రశ్నించింది.

'బాధలు మనిషికి పరీక్షలు. పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించడము ఉత్తమ లక్షణం' - స్థిర నిర్ణయం జవాబిచ్చింది.

***

ఆపన్నుల నడ్డివిరిచే పన్నులు విధిస్తే సామాన్యులే అసామాన్యులై విప్లవ కెరటాలై పోతారు. దేశంలో శాంతిసౌభాగ్యం కొరవడుతుంది. మహామేఘవాహనుని మరణానంతరము రాజ్యభారాన్ని స్వీకరించిన ఖారవేలుడు మంత్రిమండలికి, ఉన్నతోద్యోగులకు ఖచ్చితమైన ఆజ్ఞలు జారీ చేశాడు. మహామంత్రి నుండి మామూలు ప్రభుత్వోద్యోగి వరకు పాటించాల్సిన ప్రవర్తనా నియమావళి తయారై విడులైంది. హక్కులతో పాటు బాధ్యతల బరువు అందరికీ తప్పని సరైంది.

"ముందు ప్రజా జీవనం సజావుగా సాగాలి. శత్రువుల ద్వారా, ప్రకృతి ద్వారా జరిగిన నష్టాల నుండి ప్రజలకు విముక్తి లభించాలి. అందుకోసం ఉన్నతాధికారులు, ప్రభుత్వోద్యోగులు తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తూ పంజెయ్యాలి ? ఇది నా మాతృభూమి, ప్రజలంతా నా బంధువులు అనే భావన గుండెల్లో నిండాలి. సమర్థులకు సన్మానం, అసమర్థులకు దండన తప్పదు..." మార్గదర్శక సూత్రాలు మార్గదర్శనం చేస్తున్నాయి.

ఖారవేల మహారాజు మామూలు మనిషై స్వయంగా రంగములోకి దిగడం పరివారానికి స్ఫూర్తినిచ్చింది.

'యథారాజా, తథా ప్రజ... ' నానుడి నిజమైంది. శ్రమశక్తి నాదరించిన ప్రజలు రాత్రింబవళ్ళు ఒళ్లు వంచి పంజేశారు. పటుతర దీక్ష, నిరంతర శ్రమ కొద్దికాలములోనే గొప్ప ఫలితాలందించింది. ప్రజల మీద పన్నుల భారం పడకుండా పునర్నిర్మాణ పనులు సజావుగా సాగిపోతున్నై. గట్టి మరమ్మత్తులతో కోటగోడలు పటిష్టమైపోయినై. పూడిక తీసిన చెరువులు, కాల్వలు మంచినీటితో కళకళలాడినై. పచ్చని పైర్లతో పొలాలు, పైరగాలి తరగలకు తలలూపే తోటలు కనువిందు చేస్తున్నాయి. తొండలు గూడా గుడ్లు పెట్టవనుకున్న బీడు భూములు ధాన్యలక్ష్మి నివాసాలైపోయినై. నేలతల్లి ఆకుపచ్చ పీతాంబరం ధరించి ఫలవృక్షాల, కొమ్మల సయ్యాటలతో, రంగురంగుల పూల నవ్వులతో పరవశిస్తోంది. రాజధాని నగరం నందనవనములా తయారైంది.

పంటచేలలో బంగారం పండింది. వాణిజ్య పంటలు ఎగుమతి ప్రారంభమై జోరందుకుంది. పన్నులు కట్టేందుకు రైతన్నలు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. వర్తక వాణిజ్యాల్లో అపార లాభాలార్జించిన ప్రముఖుల విరాళాలతో ప్రభుత్వ ఖజానా నిండిపోయింది. కష్టాల కడలి నుండి కళింగ సుఖాల తీరం చేరింది. ప్రజామనోభిరాముడైన ఖారవేలుని ఆలోచనలు మరోవైపు మళ్ళినై.

బుద్ధిబలంతో రాజ్యం సుభిక్షమైంది. దానికి భుజబలం తోడైతే కళింగ శక్తి సామర్థ్యాలను

ప్రపంచం గుర్తిస్తుంది. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి. పోట్లాడితే మృగరాజు సింహంతోనే పోట్లాడాలి.

అప్పటికే అతిబలవంతుడై అశ్వమేధయాగము నిరాఘాటంగా నిర్వహించిన శాతకర్ణి కళింగకు పశ్చిమాన పక్కలో బల్లెంలా పొంచి ఉన్నాడు. శాతకర్ణిని జయిస్తే శతరుద్రులను జయించినట్టేనని తెలుసు. యంత్రాంగముతో సుదీర్ఘ మంత్రాంగం సాగింది. నూతనోత్సాహంతో ఉరకలేస్తున్న కళింగ సేనా వాహిని కృష్ణా తీరం జేరింది. అన్ని హంగులున్న శాతకర్ణితో హోరాహోరి పోరు జరిగింది.

'ఖారవేలు మహారాజు శాంతి కాముకుడే కాని యుద్ధరంగంలో శత్రువుల పాలిట కాలయముడు. ప్రమాదాలు సృష్టిస్తారనుకున్న వారి మదమణచడములో మేటి'. అనుకున్న సామాన్య సైనికులకు మహారాజు వ్యూహం, యుద్ధరీతి ప్రత్యక్షంగా కనబడినై.

కృష్ణా, మూసీ నదుల సంగమ స్థానం ఖారవేలుని వశమైంది. శాతకర్ణి ఓటమి నంగీకరించక తప్పలేదు. ఋషిక్ నగరం కోటపై కళింగ విజయకేతనం రెపరెపలాడింది. ప్రపంచ రాజ్యాలు విస్తుబోయినై. చావు దెబ్బలు తినడానికి అలవాటుపడిన కళింగ చిచ్చరపిడుగై పోయిందని ముక్కు మీద వేలేసుకున్నాయి.

కీర్తి కిరీటములో కలికితురాయిగా నిలిచిన విజయం ధన, కనక, వస్తు, వాహన సంపదలను సమకూర్చింది. నిరాశా నిస్పృహలు వీడిన ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివెరిసినై. ఆత్మవిశ్వాసం బలపడింది.

విజయోత్సాహాన్ని పురస్కరించుకుని అన్నివయసుల వారికి ఆటల పోటీలు, కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. దానధర్మాలు స్వీకరించేవారు కరువైపోయారు. ఓ సంవత్సరం పాటు నృత్య, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల నుర్రూతలూగించినై. యువకులు పోటీలు పడుతూ సైన్యంలో చేరారు. దేశభక్తి ప్రాధాన్యత సంతరించుకుంది.

మంత్రులు, సామంతులు, కవులు, కళాకారులతో ఆ రోజు సభాస్థలి కిటకిటలాడ్తోంది. సంగీత సాహిత్య కార్యక్రమాలు తిలకిస్తూ పరవశులైపోతున్నారంతా. మంత్రుల మణిమయ కిరీటాల మెరుపులు, పండితుల శాలువాల రంగుల చెంగలింపులతో జతకట్టి నృత్యకళాకారుల నుత్సాహపరుస్తున్నాయి. నవరత్న ఖచిత సంహానంపై నున్న ఖారవేల మహారాజును నృత్యవిలాసం అలరిస్తోంది.

"ప్రభూ !" ఉరుములేని పిడుగులా ప్రత్యక్షమయాడు దండనాయకుడు. కార్యక్రమా లాగిపోయినై. ఏమిటన్నట్టు మహామంత్రి కనుబొమలెగిరి పడినై.

"ప్రభూ ! పవిత్ర విద్యాధరి నివాస్ మీద రథిక, భోజకులు దాడిచేసి ధ్వంసం చేశారు."

మింగుడు పడని వార్త విని సభాస్థలి మూగవోయింది. ఖారవేలుని కళ్ళల్లో ఎర్ర జీరలు కదలాడినై.

"తక్షణమే ఆ సర్దారులు మదమణిగించాలి." గొంతులో కాఠిన్యం - "తరతరాలుగా మా వంశస్థుల పూజలందుకుంటున్న విద్యాధరి నివాస్‌ను అపవిత్రం చెయ్యడం ఆటవిక చర్య. అది మనందరికీ అవమానం" - చూపులు మహామంత్రి వైపు మళ్ళినై. కళాకారుల బృందము పక్కకు తొలగిపోయింది. అందరి మనసుల్లో ఆందోళన.

"రథిక, భోజక సర్దారుల దుస్సాహసం క్షమించరానిది. ప్రస్తుత కళింగ పరిస్థితిని అంచనా వేయలేక వంచనకు దిగి కాలాగ్నిని కౌగలించుకున్నారు" - మహామంత్రి పళ్ళు పటపట లాడినై. దృష్టి సేనానాయకుని వైపు మళ్లింది.

"మహారాజా !" - సేనా నాయకునిలో పౌరుషాగ్ని రగిలింది. ఖడ్గమ్మీద చెయ్యేసి, "కళింగ సైనిక శక్తికిదొక పరీక్ష. అనుమతిస్తే సర్దారులను ప్రాణాలతో పట్టి తెచ్చి మీ పాదాల ముందుంచుతాం" - ప్రతిజ్ఞ చేశాడు.

యుద్ధభూమిలో బందీలైన రథిక, భోజకులు తమ కిరీటాలను ఖారవేలుని పాదాల ముందుంచి శరణాగతులయారు.

"ఖారవేల మహారాజా శక్తి సామర్థ్యాలు దెలీక పప్పులో కాలేశాం ?" పశ్చాత్తాపంతో కుంగిపోతున్న రథికుడు లెంపలేసుకున్నాడు.

"మా ప్రాణాలిప్పుడు మీ చేతిలో ఉన్నాయి. మన్నించి కన్నతండ్రిలా కాపాడుతారో, కరవాలానికి మా తలలనప్పగిస్తారో... అంతా మీ దయ" - భోజకుడు వణికిపోతూ ముక్కునేలకు రాశాడు.

తమ దగ్గరున్న ధనరాశుల్ని మహారాజుకు సమర్పించుకుని, తలలు వంచి చేతులు కట్టుకు నుంచున్నారు.

"పశ్చాత్తాపంతో తలల వంచుకున్న మిమ్మల్ని కళింగ క్షమిస్తుంది. కాని... పవిత్ర విద్యాధరి నివాస్‌ను పునరుద్ధరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత మీదే ...." ఆజ్ఞాపించాడు, ఖారవేలుడు.

'బలవంతుల సామర్థ్యానికి నిదర్శనం క్షమా గుణం' - అంటూ నిర్ణయాన్ని వేనోళ్ళ పొగిడారంతా.

ప్రభుత్వ ఖజానా ధనరాశులతో నిండిపోయింది. ప్రజల నుండి పన్నులేవీ వసూలు చేయరాదని రాజాజ్ఞ వెలువడింది. లక్ష్మీదేవి తాండవాన్ని భరించలేక దరిద్ర దేవత కళింగ దరిదాపుల్లో నిలువలేక కాలికి బుద్ధి చెప్పింది. సుఖశాంతులు నివాసమేర్పరుచుకున్నాయి. రాణి వజీ రాఘవతి కడుపు పండి పుత్రోదయమైంది. ఖారవేలుని మదిలో మల్లెలు పూచినై. ఆనందం ఆర్ణవమై ఉత్సవాలు జరిపించింది.

ఎన్ని సంతోషాలున్నా ఖారవేలుని మనసులో శీతలనాథ జైన విగ్రహం మెదుల్తూనే ఉంది. 'నేనింకా మీ రాజ్యానికి రావొద్దా ?' అని దీనంగా ప్రశ్నిస్తోంది ? 'నన్ను తిరిగి సాధించుకునే

శక్తియుక్తులు మీకింకా సమకూరలేదా ?' అని నిలదీస్తోంది. సమస్య బలపడి గుండెలకు గుచ్చుకుంటూనే ఉంది.

మగధతో యుద్ధమంటే మాటలా ? అది సాధ్యమా ?

ఎందుక్కాదు. శాతకర్ణిని జయించిన సామర్థ్యం మగధనుపేక్షిస్తుందా ?

చీమా, దోమ గూడా చొరబడలేని మగధ రాజభవనాన్ని వశపరచుకోవాలనుకోవడం స్వర్గాధిపతితో తలపడ్డమే.

అయితే మాత్రం... ప్రస్తుత కళింగ శక్తి సామర్థ్యాలను అంచనా వేయగలిగితే స్వర్గాధిపతి గూడా సంధి చేసుకోవాల్సిందే.

అంతరంగములోని సంఘర్షణా తరంగాలు నిరంతరం ఎగిరి పడ్తూనే ఉన్నాయి.

ఏది ఏమైనా సరే ప్రజల నమోభావాలను పట్టం కట్టాల్సిందే. ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. వ్యూహరచన కోసం మంత్రులు, సేనా నాయకులతో సమాలోచన సాగుతోంది.

"మహామంత్రీ !" – ఖారవేలుని మెదడు పొరల్లో కొత్త మెరుపు.

"మహారాజా !"

"దక్షిణ దిశలో నున్న గోరథగిరి కోటనే కదా మగధ రాజధానిని రక్షిస్తోంది."

"నిజమే, కొండల మధ్యనున్న ఆ కోటనే మగధ రాజధానికి రక్షణ కవచం" – ముకుళించుకుపోయిన సేనా నాయకుని మొహం వికసించింది.

"ముందే గోరథ గిరిని జయిస్తే... !"

"గోరథగిరిని జయించడమంటే గోవర్ధనగిరి నెత్తడం లాంటిది. వ్యూహం పటిష్టంగా ఉండాలి. ఆచరణ పకడ్బందీగా జరగాలి" – మరో మంత్రి హెచ్చరించాడు.

"మన ఖారవేల మహారాజుగారికి యుద్ధ భూమి క్రీడారంగము, అందుకే అసాధ్యమనుకున్నవన్నీ సుసాధ్యమై పోతున్నై" – మహామంత్రీ ధీమా.

అర్థవంతమైన చర్చలు ఫలవంతమై తిరుగులేని వ్యూహం తయారైంది. వ్యూహం తు.చ. తప్పకుండా అమలవుతోంది. కళింగసేనలు గోరథగిరిని చుట్టుముట్టినై. దుస్సాహసముతో ముందుకొచ్చిన మగధ సైనికులు శవాలైపోతున్నారు. శరణాగతులు రక్షణ పొందుతున్నారు. యుద్ధభూమి వేడెక్కింది.

సాయంకాలం... సూర్యకిరణాలు పడమటి కొండలకు పాకగానే ఆకాశం చీకటి పరదాలు దించుతోంది. ఆ రోజుకు యుద్ధం ఆగిపోయింది. ఇరుపక్షాల సైనికులు గుడారాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ముఖ్య నాయకులతో ఖారవేలుని గుడారములో సమీక్ష సాగుతోంది.

ఆముదం దీపం దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

"ప్రభూ !" గూఢచారి పరుగెత్తుకొచ్చి చేతులు జోడించాడు.

"ఏమిటీ ? "

"మహారాజా ! గ్రీకు దేశము రాజు దిమిత్రియస్ పెద్ద సైన్యముతో మగధపై దండయాత్ర కొస్తున్నాడు".

పిడుగులాంటి వార్త.

ఎత్తులతో, నక్కజిత్తులతో భారతదేశంలోని రాజ్యాలన్నింటిని జయించాలని దిమిత్రియస్ బయలుదేరాడని తెలుసుగాని ఇంత త్వరగా మగధ వస్తాడని ఎవ్వరూ ఊహించలేదు. ఖారవేలుని మొహంలో రంగులు మారినై. ఆలోచనలకనుగుణంగా ముఖకవళికలు మారుతున్నాయి.

"అయితే కాగల కార్యం గంధర్వులే తీరుస్తారు. దిమిత్రియస్‌ను మనమాహ్వానించి, చేతులు కలిసి మగధ మదమణగిద్దాం. శీతలనాధ విగ్రహాన్ని మనకప్పగించాలని ముందే ఒప్పందం చేసుకుంటే సరి..." దండనాయకుడొకరు మురిసిపోతున్నాడు.

"లేదు.... కాదు" దిక్కులు పిక్కటిల్లజేసిన ఆ గొంతు ఖారవేలునిదే. ఖారవేలుడు కాలరుద్రుడయాడు.

"ఓ విదేశీయుడు మన సోదర రాజుతో యుద్ధం చేస్తుంటే మనం సహకరించడం ఆత్మహత్యా సదృశ్యం. ఏనాటికైనా, ఎప్పుడైనా భారతదేశంలోని ఏ రాజ్యాన్నైనా సరే భారతీయులే పాలించాలి..." గుండెలు రగిలిపోతున్నై.

శాంతమూర్తిలో క్రాంతి కిరణాలా !

ఎలా స్పందించాలో ఎవరికీ అర్థం కాలేదు.

"ప్రభు ! తమరు కాస్త శాంతించాలి" - మహామంత్రి సముదాయింపు.

"మీరన్నది నిజం. భారతదేశం రాజ్యాలుగా విభజించబడుతుంది. భిన్నత్వములో ఏకత్వాన్ని మరచిన రాజుల అనైక్యత నాసరాగా చేసుకుని ఈ వేదభూమి నాక్రమించు కోవాలని విదేశీయులు పరుగెత్తుకొస్తున్నారు. వారి ఆటలు సాగనిస్తే మనదేశం అధోగతి పాలవుతుంది."

"క్షమించండి ప్రభూ !" భయంతో వణికిపోతున్నాడా దండనాయకుడు. "నా అజ్ఞానాన్ని మన్నించండి మహారాజా !" పాదాక్రాంతుడైనాడు.

"లే... దండనాయకా !" ఖారవేలునిలో శాంతి పవనాలు వీచాయి - "రేపటి నుండి మన యుద్ధం దిమిత్రియస్‌తో. మగధకు అండగా ఉండి విదేశీ దురాక్రమణదారును తరిమి కొట్టాలి. మన విగ్రహం విషయములో నిగ్రహం పాటిద్దాం. ఈ భూమి పుత్రులంతా ఒకటేనని నిరూపిద్దాం."

వ్యూహం మారింది. మారిన పరిస్థితుల కనుగుణంగా కొత్త పథకం రూపుదిద్దుకుంది.

ఈ విషయం దిమిత్రియస్‌కు తెలిసిపోయింది. అనన్య సామాన్యమైన ఖారవేలుని శక్తియుక్తులు, దేశభక్తి ముందు తన ఆటలు సాగవని అర్థమైపోయింది. వెంటనే తన సేనలను వెనక్కు తిప్పేశాడు.

'భారతదేశం బంగారు పిట్టనే... కాని దాన్ని ఖారవేలుడోపట్టాన పట్టుకోనివ్వడు. పట్టుకోవాలని అతన్నెదిరించిన వారి ప్రాణాలు పోవడం ఖాయం' అనుకుంటూ స్వదేశంవైపు నిష్క్రమించాడు.

విజయోత్సాహం కళింగ సేనలకు కొండంత బలాన్నిచ్చింది. అదే వేడిలో ద్రవిడ రాజుల

ఆగడాల నరికట్టి సామంతులుగా మార్చుకున్నాయి. వెనువెంటనే పితుండ కోటలో పాగా వేశాయి.

దక్షిణా పథమంతా తన కనుసన్నలలో కొచ్చినా ఖారవేలుని మనసు పొరల్లో శీతలనాథ జైన విగ్రహం మెదుల్తూనే ఉంది. మహామంత్రి తన అవగాహననంతా నెమరేసుకుని, "మగధను సులువుగా జయించాలంటే ముందు తక్షశిల మన అధీనంలోకి రావాలి" సలహా యిచ్చాడు. సేనానాయకుడు బల పరిచాడు.

సలహా అక్షరాలా అమలైంది. తక్షణమే ఉత్తరాపథము వైపు సాగిన కళింగ సేనలు తక్షశిలను వశపరచుకున్నాయి.

ఇహ విగ్రహాన్ని సంపాదించి ప్రజామనోభీష్టం నెరవేర్చాల్సుంది. మగధలో కాలు మోపే వ్యూహం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. యంత్రాంగముతో కీలక మంత్రాంగము సాగుతోంది.

"ప్రభూ !" ప్రతీహారి ప్రవేశించి, "మగధ మహారాజు బృహస్పతిమిత్రవారు తమరి దర్శనార్థం సపరివారంగా విచ్చేశారు", భక్తి శ్రద్ధలతో విన్నవించాడు.

కలా... నిజామా ?... మగధ మహారాజేమిటీ... కళింగకు స్వయంగా... అదీ సపరివార సమేతంగా రావడమేమిటీ ? మొదట అయోమయం - ఆ తర్వాత ఆశ్చర్యం... యుద్ధ సన్నద్ధమైన యంత్రాంగము భృకుటి ముడిపడింది.

మహారాజు గాంభీర్యాన్ని జాగ్రత్తగా గమనించి "నువ్వు సరిగా చూశావా ?" మహామంత్రి ప్రశ్నించాడు.

"నేనే కాదు, మన పరివారమంతా చూస్తున్నారు. ప్రభువుల వారు అనుమతిస్తే ప్రవేశ పెడ్తాను."

"వీల్లేదు" ఖారవేలుని కంచుకంఠం ఖంగుమంది – "ఓ మహారాజును మరో మహారాజు ఎలా గౌరవించాలో అలా గౌరవిద్దాం. మనమే స్వయంగా ఎదురేగి స్వాగతిద్దాం మహామంత్రీ !"

నాదస్వరం, మేళతాళాలతో బృహస్పతి మిత్రకు బ్రహ్మాండమైన స్వాగతం లభించింది. మగధ నుండి తరలించుకు వచ్చిన శీతలనాథ జైన విగ్రహం నిండుసభలో ఖారవేలు మహారాజు కప్పగించబడింది. దాంతోపాటు అమూల్యమైన కానుకలందాయి.

"గొడ్డలితో సాధిస్తామనుకున్నది గోరుతోనే వశమైంది" అంటుంటే ఖారవేలుని మానస వీణ సంతోషరాగమాలాపించింది.

"మా ప్రజామనోభీష్టం నెరవేరింది" అంటూ బృహస్పతి మిత్రను అభినందనలతో ముంచెత్తాడు.

కళింగలో తమ పరిస్థితి ఎలాగుంటుందోనని వెనకాముందాడిన మగధ మహారాజు ఆనంద పరవశుడయ్యాడు. కళింగ అందించిన వజ్ర వైడూర్యాది కానుకలందుకుని లేచి వెళ్ళి ఖారవేలుని చేతులందుకుని కళ్ళలోకి చూశాడు.

"ఖారవేల మహారాజా ! మన వైరం విదేశీయులకేమాత్రం అవకాశం ఇవ్వరాదని చేతలలో చూపించారు. విదేశీ దురాక్రమణ నుండి భారతావనిని రక్షించారు. అది మాకెంతో స్ఫూర్తి నిచ్చింది". - చేతులు కళ్లకద్దుకున్నాడు.

పొంగిపోయిన ఖారవేలుని ఆనందము, "మీ సమయస్ఫూర్తికి మా జోహార్లు" గుండెలకు హత్తుకుంది. రెండు హృదయాలు... గంగా యమునల సంగమమై పోయినై. పగ, ద్వేషాలు పటాపంచలైపోయాయి.

"ఖారవేల మహారాజా ! మీ ఉన్నతాశయం, భవిష్యత్తు దర్శనం మమ్ములనబ్బుర పరచినై. మీ శౌర్యధైర్యాలు నన్నిక్కడిదాకా రప్పించినై." బృహస్పతిమిత్ర పలుకులు సభికుల నుల్లాస పరిచినై.

"మిత్రమా బృహస్పతిమిత్రా !! ఖారవేలుని గుండెలుప్పొంగినై - "దేవుని అనుగ్రహం వల్ల మా విగ్రహం మాకు తిరిగి వచ్చింది. మీరందిచించిన స్నేహహస్తం భారత దేశంలోని రాజులందరికీ ఆదర్శం. ఇక ముందే విదేశీయుడూ ఈ పుణ్యభూమి వైపు కన్నెత్తి చూడరాదు. మన రాజుల్లో అనైక్యత అలుముకున్ననాడు భారతీయులు విదేశీ శక్తులకు బానిసలైపోతారు. పంజరములో పక్షుల్లా అల్లాడిపోతారు. దేశద్రోహుల్ని ముందు తరాలవారు ఛీ కొట్టి చరిత్రహీనులుగా సృష్టిస్తారు. మనమంతా భారతమాత సంతానం. ఏకతా సూత్రము మన తారక మంత్రము. అదే భారతావనికి శ్రీరామరక్ష" ముగించి, "భారత్ మాతాకీ జై" అని ఎలుగెత్తి జై కొట్టాడు.

ఆ ధ్వనికి స్పందించి "భారత్‌మాతాకీజై" వేలాది గొంతులు ప్రతిధ్వనించినై.

**డిసెంబర్, 2002**
**'రచన' ఇంటింటి పత్రిక లో**
**ప్రచురితమైంది.**

